ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
సోమవారం 6 జనవరి 2025



రేపు పాలకొండలో మినీ జాబ్‌మేళా

పార్వతీపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పాలకొండలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 7న మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్ ఏదైనా డిగ్రీ పూర్తయిన అభ్యర్థులు, 18 నుంచి 32 ఏళ్ల లోపు వారు విద్యార్హత ధ్రువ పత్రాలతో హాజరుకావొచ్చన్నారు. వివిధ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. నిరుద్యోగులు ముందుగా తమ పేర్లను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు ఈ 63012 75511 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

పండగ లోపు పూర్తయ్యేనా?



కోటవానివలస ప్రాంతంలో రహదారి దుస్థితి



ఉల్లిభద్ర ప్రాంతంలో రహదారి ఇలా..

- పార్వతీపురం-పాలకొండ రోడ్డుకు కలగని మోక్షం
- నిధులు మంజూరైనా.. పూర్తికాని ప్యాచ్ వర్కులు
- కొంతమేర పనులైనా.. ఇటీవల కురిసిన వర్షాలకు యథాస్థితి
- అడుగడుగునా గోతులతో ప్రమాదకరంగా మారిన రహదారి
- రాకపోకలు సాగించలేకపోతున్న వాహనదారులు
- సంక్రాంతి లోగా రోడ్డు మెరుగుపర్చాలని సర్కారు ఆదేశం
- ఆ లోపుగా పూర్తవడం కష్టమే..
- ఆర్అండ్‌బీ శాఖాధికారులు స్పందించాలని విన్నపం

గరుగుబిల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి)

పార్వతీపురం నుంచి పాలకొండ వైపు వెళ్లే ప్రధాన రహదారి పనులకు మోక్షం లభించడం లేదు. ప్యాచ్ వర్కులు పూర్తికాకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు తప్పడం లేదు. అసలే ఇది పండగ సమయం. సాధారణ రోజులతో పోలిస్తే.. ఈ మార్గం కూడా రాకపోకలు సాగించే వాహనదారుల సంఖ్య పెరిగింది. అయితే పట్టుమని కిలోమీటరు కూడా వారు సాఫీగా ప్రయాణించ లేకపోతున్నారు. అడుగడుగునా ఏర్పడిన భారీ గోతుల కారణంగా నానా అవస్థలు పడుతున్నారు. మరికొందరు ప్రమాదాలకు గురువుతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో ఎంతో కీలకమైన పార్వతీపురం-పాలకొండ ప్రధాన రహదారిపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. మరమ్మతులకు నిధులు కూడా మంజూరు చేయలేదు. దీంతో ఈ రోడ్డు భారీ గోతులతో మరింత అధ్వానంగా మారింది. గత ఐదేళ్లూ వాహనదారులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. అయితే ఈ సమస్యలను పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం ఈ రోడ్డుపై దృష్టి సారించింది. ఈ మేరకు చిన్నపాటి గోతులు పూడ్చివేతకు రూ.40 లక్షలు మంజూరు చేశారు. ఈ మొత్తంతో సంతోషపురం వరకూ పనులు చేపట్టినా ఇటీవల కురిసిన వర్షాల (మిగతా 8వ పేజీలో...)

పశువులకు వ్యాధులు..
అందని వైద్య సేవలు

- భామిని మండలంలో పరిస్థితి ఇదీ..
- ఆందోళనలో పెంపకందారులు

8లో



ఉత్సాహంగా..

- సీతంపేటలో పర్యాటకుల సందడి

8లో



యుగ పురుషుడు ఎన్టీఆర్

- విశ్వతేజ పుస్తకావిష్కరణలో ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు

8లో



వైసీపీ నిర్వాకం.. కూటమిపై భారం

- వార్డు సచివాలయాలకు సొంత గూడు కరువు
- పరాయి పంచనే కొనసాగుతున్న వైనం
- హడావుడిగా ఏర్పాటు చేసి.. భవనాలు నిర్మించని గత ప్రభుత్వం
- ప్రతినెలా భారీగా అద్దెలు చెల్లిస్తున్న కూటమి సర్కారు



పార్వతీపురంలో అద్దె భవనంలో ఉన్న 14వ సచివాలయం

పార్వతీపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఎంతో హడావుడిగా వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసింది. అయితే మౌలిక వసతులను మాత్రం మరిచింది. ఐదేళ్లలో సొంత భవనాలను కూడా నిర్మించలేకపోయింది. దీంతో నేటికీ వార్డు సచివాలయాలు పరాయి పంచనే కొనసాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కొన్నిచోట్ల ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో సచివాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేశారు. కానీ పట్టణ పరిధిలో ఈ అవకాశం లేకుండాపోయింది. ప్రత్యేక నిధులతో పాటు స్థలాలను సమకూర్చాలిన వైసీపీ సర్కారు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో అవి సొంత భవనాలకు నోచుకోలేదు. ఏదేమైనా గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా సచివాలయాల అద్దెల భారం కూటమి ప్రభుత్వంపై పడింది.

ఇదీ పరిస్థితి..

జిల్లా కేంద్రం పార్వతీపురంలో 15, సాలూరు పట్టణంలో 14, పాలకొండలో తొమ్మిది సచివాలయాలు ఉన్నాయి. పాలకొండలో ప్రభుత్వ కార్యాలయాలకు చెందిన భవనాల్లో రెండు సచివాలయాలను నిర్వహిస్తున్నారు. మిగిలిన ఏడు కూడా అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. సాలూరు పట్టణంలో ఉన్న 14 సచివాయాలకూ సొంత భవనాలు లేవు. పార్వతీపురంలో 15 సచివాలయాలు ఉండగా.. పార్వతీపురం మున్సిపాలిటీకి చెందిన ఓ ప్రభుత్వ భవనంలో ఒక సచివాలయాన్ని నిర్వహిస్తున్నారు. మిగిలినవన్నీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వాటి కోసం ప్రతినెలా పెద్ద మొత్తంలో అద్దెలు చెల్లించాల్సి వస్తోంది. దశలవారీగానే సచివాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేసి వసతి సమస్యతోపాటు అద్దెల భారం తప్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉందని జిల్లావాసులు అభిప్రాయపడుతున్నారు.

80 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి

- రూ.394 కోట్లు చెల్లింపు
- జిల్లా రైతులు హర్షం





పార్వతీపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలు 80 శాతం పూర్తయ్యింది. ఇప్పటివరకు రైతుల ఖాతాలకు సుమారు రూ.394 కోట్లు జమ చేశారు. ప్రభుత్వ ఆదేశాలతో పండగ ముందు పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేపట్టి.. గంటల వ్యవధిలోనే ఖాతాల్లోకి సొమ్ము జమ చేయడంపై జిల్లా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ధాన్యం విక్రయాల సొమ్ము సకాలంలో జమ కాని పరిస్థితి. రైతులంతా బ్యాంకు మెసేజ్‌ల కోసం ఎదురుచూసేవారు. పంట విక్రయాలకూ అష్టకష్టాలు పడేవారు. దీంతో అప్పులు చేసి పండగ చేసుకోవాల్సిన దుస్థితి. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వ చర్యలతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశాలతో జాయింట్ కలెక్టర్ శోభిక, సివిల్ సప్లైస్ డీఎం శ్రీనివాసరావు పర్యవేక్షణలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టారు. అయితే ఈ నెల ఐదు నాటికి 1,74,675 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తి చేశారు. ఈ మేరకు సుమారు రూ.394 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. రైతుల బ్యాంకు ఖాతాలోకి ఆ నగదు జమ కావడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవు తున్నాయి. అన్నదాతలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

కళ్లికోటలో ఏనుగులు

కొమరాడ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నాగావళి నదికి తూర్పు వైపున ఉన్న ప్రాంతాల్లో గత కొద్ది రోజులుగా సంచరించిన ఏనుగులు ఆదివారం కొమరాడ మండలంలోని కళ్లికోట, గారవలస గ్రామాల మధ్య హల్‌చల్ చేశాయి. దీంతో అటవీశాఖ సిబ్బంది సమీప ప్రాంత వాసులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా రాత్రి సమయంలో పంట పొలాల్లోకి రైతులు వెళ్లరాదని సూచించారు. వాస్తవంగా కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలో ఏనుగుల సంచారం లేకపోవడంతో వ్యవసాయ పనుల్లో రైతులు బిజీగా గడిపారు. అయితే ప్రస్తుతం గజరాజులు సంచరిస్తుండడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. వాణిజ్య పంటలైన అరటి, పత్తి, మొక్కజొన్న, కాయగూరలు నాశనమయ్యే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. తక్షణమే ఈ ప్రాంతం నుంచి గజరాజులను తరలించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



కళ్లికోట, గారవలస గ్రామాల మధ్య సంచరిస్తున్న ఏనుగుల గుంపు

తాగునీటికి కటకట

- వీరఘట్టంలో శివారు ప్రాంతవాసులకు పూర్తిస్థాయిలో అందని నీరు
- బిందెడు నీటి కోసం తిప్పలు.. వేసవిలో రెట్టింపవుతున్న బాధలు
- గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పూర్తికాని జేజేఎం పనులు
- కూటమిపైనే ఆశలు

ఇబ్బందులు పడుతున్నాం..



తాగునీటి కోసం రోజూ కొళాయి వద్ద ఇబ్బందులు పడుతున్నాం. పైపుల ద్వారా పూర్తిస్థాయిలో నీరు రావడం లేదు. దీంతో తాగునీటికి అవస్థలు పడాల్సి వస్తోంది.

- దూసి వెంకమ్మ, వీరఘట్టం

30 ఇళ్లకు ఒక కొళాయి..



కూరాకులవీధిలో 30 ఇళ్లకు ఒక కొళాయి మాత్రమే ఉంది. దాని నుంచి తక్కువ నీరు రావడంతో ఇంటికి ఒక బిందె మాత్రమే పడుతున్నాం.

-కర్రి సరస్వతి, వీరఘట్టం

అధికారులు స్పందించాలి



రోజూ పనులన్నీ మానుకుని గంటల తరబడి నిల్చుంటున్నా పూర్తిస్థాయిలో తాగునీరు రావడం లేదు. అధికారులు స్పందించాలి.

- బొద్దాన చిన్నమ్మడు, వీరఘట్టం

వీరఘట్టం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం మేజర్ పంచాయతీలో తాగునీటి ఎద్దడి నెలకొంది. పూర్తిస్థాయిలో నీరు అందకపోవడంతో శీతాకాలంలోనూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటు పార్వతీపురం జిల్లా కేంద్రం.. ఇటు పాలకొండ నియోజకవర్గానికి అతి సమీపంలో ఈ పంచాయతీ ఉన్నా.. సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. గత ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పనులను పూర్తి చేయించ లేకపోయింది. దీంతో ఆ ప్రాంత వాసులు తాగునీటికి కటకటలాడుతున్నారు. వేసవిలో వారి బాధలు రెట్టింపవుతున్నాయి. బిందెడు నీటి కోసం పరుగులు పెట్టాల్సి వస్తోంది. ప్రస్తుతం ఆ ప్రాంతవాసులంతా కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. రానున్న వేసవిలో తాగునీటి ఇక్కట్లు లేకుండా చూడాలని కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

వీరఘట్టంలో 14,315 మంది నివసిస్తున్నారు. 3,586 కుటుంబాలకు తాగునీరు అందించేందుకు గాను గ్రామ సమీపంలోని 400 కేఎల్ సామర్థ్యంతో అప్పట్లో రక్షిత నీటి పథకం నిర్మించారు. ఒట్టిగెడ్డ వద్ద మోటార్లు ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టారు. అయితే కాలక్రమంలో గ్రామంలో జనాభా పెరుగుతున్నప్పటికీ అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయలేదు. దీంతో శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఇదిలా ఉండగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జేజేఎం కింద ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేయలేదు. మరోవైపు నిధులు కూడా వెనక్కి మళ్లిపోయాయి. దీంతో ఆ పనులకు బ్రేక్ పడింది. ఇటీవల 40 కేఎల్ సామర్థ్యంతో రక్షిత నీటి పథకం నిర్మించినా పైప్‌లైన్ పనులు పూర్తి కాకపోవడంతో ఫలితం లేకుండా పోయింది. మొత్తంగా వేసవితో పాటు అన్ని కాలాల్లోనూ ఆ గ్రామస్థులు తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీరఘట్టం శివారున ఉన్న డౌన్ స్ట్రీట్, కస్పావీధి, కూరాకులవీధిలో 500 కుటుంబాలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందడం లేదు. గంటల కొద్దీ నిరీక్షించినా ప్రయోజనం దక్కడం లేదు. రోజుకు ఒక బిందె నీరు మాత్రమే పట్టి పొదుపుగా వాడాల్సిన పరిస్థితి నెలకొంది. వారికి పూర్తిస్థాయిలో తాగునీరు అందాలంటే 200 కేఎల్ సామర్థ్యంతో మరో రక్షిత నీటి పథకం నిర్మించాల్సిన అవసరం ఉంది. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.



కొళాయి వద్ద నీటిని పడుతున్న గ్రామస్థులు



వీరఘట్టంలో రక్షిత నీటి పథకం ట్యాంక్

ప్రతిపాదనలు పంపిస్తాం..

గ్రామానికి సరిపడా తాగునీరు అందాలంటే మరొక వాటర్ ట్యాంక్ నిర్మించాల్సిన అవసరం ఉంది. 200 కేఎల్ సామర్థ్యం రక్షిత నీటి పథకం నిర్మిస్తే శివారు ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారమవుతుంది. దీనిపై ప్రతిపాదనలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపిస్తాం.

- కావ్యశ్రీ, జేఈ, ఆర్‌డబ్ల్యూఎస్



మోగిన శంఖం

కదంతొక్కిన హైందవ సోదరులు.. కాషాయమయమైన కేసరపల్లి

భారతీయ సంస్కృతి, సంప్రదాయం, సనాతన ధర్మం, ఆధ్యాత్మికతను భవిష్యత్ తరాలకు చాటిచెప్పే ఉద్దేశంతో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లాలోని గన్నవరం మండలం కేసరపల్లిలో ఆదివారం హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి హిందువులు పెద్ద ఎత్తున తరలి రావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దేశవ్యాప్తంగా కీర్తి గడించిన ఎందరో హైందవ నేతలు తమ ప్రసంగాల్లో హిందూధర్మం గొప్పతనాన్ని చాటిచెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి హైందవ సోదరులు ర్యాలీలుగా తరలివచ్చారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి


సభా ప్రాంగణానికి వెళ్తున్న హిందువులు




సభలో ప్రసంగిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి, గోవింద్ దేవ్ గిరిజి మహరాజ్, స్వామి కమలానంద, స్వామి వరదానంద


హిందూ సోదరులతో కిక్కిరిసిన కేసరపల్లిలోని సభా ప్రాంగణం


కొత్తపేట వద్ద నిర్మించిన బ్యారేజ్

తారకరామపైనే ఆశలు

- దశాబ్దాలుగా కలగా మిగిలిన ప్రాజెక్టు ● గత ఐదేళ్లూ పూర్తి నిర్లక్ష్యం
- ఏటా బడ్జెట్‌లో కేటాయింపులే తప్ప మంజూరు లేకపోయె
- ప్రత్యేకంగా దృష్టిపెట్టిన కూటమి ప్రభుత్వం

తారకరామతీర్థ సాగర్.. విజయనగరం జిల్లాలో వేలాది ఎకరాల్లో సాగు... వందలాది గ్రామాల తాగునీటి అవసరాలు తీర్చగలిగే ప్రాజెక్టు ఇది. అపర భగీరథిగా నిలుస్తుందని ప్రజలంతా కలలు కన్నారు. ఏటా పనుల కోసం కళ్లలో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తూ వస్తున్నారు. వైసీపీ పాలనలో బడ్జెట్‌లో అంకెల గారడీ తప్ప నిధుల కేటాయింపు లేదు. దీంతో ప్రగతి పడకేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా అంచెలంచెలుగా ప్రాజెక్టు పనులు పూర్తిచేయాలన్న సంకల్పంతో ఉంది. నిర్వాసితులకు పునరావాసం కల్పించి ప్రాజెక్టు నిర్మాణ పనులు జరిపించడానికి శరవేగంగా పావులు కదుపుతోంది. యంత్రాంగం అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించింది.

నెల్లిమర్ల (విజయనగరం), జనవరి 5 (ఆంధ్రజ్యోతి)

విజయనగరం జిల్లా నెలిమర్ల నియోజకవర్గంలోని డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో 49 రెవెన్యూ గ్రామాల్లో 24,710 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలన్నది తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. 2014లో టీడీపీ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించి శరవేగంగా పనులను జరిపించింది. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఐదేళ్ల పాటు నిర్లక్ష్యం చేసింది. దీంతో పనులు నత్తనడకన సాగాయి. ఇప్పటివరకూ కేవలం 44 శాతం పనులు పూర్తయినట్టు గణాంకాలు చెబుతున్నాయి. బ్యారేజీకి సంబంధించి 90 శాతం పనులు పూర్తయ్యాయి. డైవర్షన్ కెనాల్స్, టెన్నల్ పనులు 50, జలాశయం పనులు 55, కెనాల్స్ పనులు 80 శాతం పూర్తయ్యాయి. అయితే గత ఐదేళ్లలో బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించారు. తీరా విడుదలకు వచ్చేసరికి మొండిచేయి చూపారు. 2019-20లో రూ.41 కోట్లు కేటాయించారు. రూ.5.63 కోట్లు మాత్రమే విడుదల చేశారు. 2021లో రూ.80 కోట్లకుగాను రూ.23.57 కోట్లు, 2022లో రూ.201 కోట్లకుగాను రూ.28.49 కోట్లు, 2023లో రూ.124.50 కోట్లకు గాను రూ.2.76 కోట్లు, 2024లో 30.27 కోట్లకుగాను రూ.16.58 కోట్లు విడుదల చేశారు.

ఇంకా ఎన్నాళ్లో..

2008లో పూర్తికావాల్సిన ప్రాజెక్టు ఎప్పటికి కొలిక్కి వస్తుందో తెలియడం లేదు. 2005లో దివంగత రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞంలో భాగంగా ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.220 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. 2008 నాటికి పనులు పూర్తిచే స్తామన్నారు. అప్పటి నుంచి పనులు ఆగుతూ.. సాగుతూ వస్తున్నాయి. పునరావాసం, పరిహారం సమస్యలు వెంటాడుతున్నాయి. మొత్తం ప్రాజెక్టుకుగాను రూ.281 కోట్లు కేటాయించగా.. అందులో భూసేకరణకే రూ.201 కోట్లు ఖర్చుచేశారు. మిగతా రూ.80 కోట్లతో పనులు జరిపారు. గత ఏడాది నాబార్డు నిధులు రూ.194 కోట్లు మంజూరుకావడంతో పెండింగ్ పనులు చేపడుతూ వచ్చారు. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ. 50 కోట్లు కేటాయించినా.. నిధుల మంజూరులో ఆశించిన పురోగతి లేదు. ఇది పనులపై ప్రభావం చూపుతోంది.

లక్ష్యం ఇదే..

ప్రాజెక్టు పూర్తయితే పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం మండలాల్లోని 49 గ్రామాల పరిధిలో 24,710 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. ఇందులో కుమిలి చెరువు కింద ఉన్న 8,172 ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని స్థిరీకరించవచ్చు. అదనంగా మరో 16,538 ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. మూడు మండలాల్లో తాగునీటి అవసరాలకు 0.162 టీఎంసీల నీటిని వినియోగించుకోవచ్చు. అలాగే విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని సాగునీటి అవసరాలకు మరో 0.48 టీఎంసీల నీటిని తరలించవచ్చు. అసలు విజయనగరంలో తాగునీటి ఇక్కట్లు లేకుండా చూడవచ్చు.

చేయాల్సిన పనులివే..

పెండింగ్ పనులు చాలా ఉన్నాయి. ఏటీ అగ్రహారం, పడాలపేట, కోరాడపేట గ్రామాల్లో నిర్వాసితులకు పునరావాసం, ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ అందించాల్సి ఉంది. ప్రాజెక్టుకు 3,446 ఎకరాల భూమి అవసరం ఉండగా.. ఇప్పటివరకూ 3,243 ఎకరాలను సేకరించగలిగారు. చంపావతినదిపై ఆనందపురం వద్ద నిర్మించిన బ్యారేజీ నుంచి కుమిలి వద్ద నిర్మించే జలాశయానికి నీరు తరలించేందుకు డైవర్షన్ కాలువ నిర్మాణం చేపట్టాలి. నెల్లిమర్ల మండలం గొల్లపేట వద్ద కొండలను తొలచి కాలువను నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం ఎస్ఎస్ఆర్ పేట వద్ద టెన్నల్ పనులు జరుగుతున్నాయి. ప్రాజెక్టు పరిధిలో 9 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ప్రత్యేకంగా స్లూయిజ్, తూములు నిర్మించాల్సి ఉంది. కుమిలి చెరువు కింద 3500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలంటే తూమును తప్పకుండా నిర్మించాలి. కుమిలి జలాశయం నిర్మాణ పనులు దాదాపు 50 శాతం పెండింగ్‌లోనే ఉన్నాయి. జలాశయం చుట్టూ 9 కిలోమీటర్ల మేర మట్టికట్ట పనులు చేపడుతున్నారు. నాలుగు కిలోమీటర్ల మేర రాతిపేర్పుడు పనులు పూర్తయ్యాయి. ఇంకా ఐదు కిలోమీటర్ల మేర చేపట్టాల్సి ఉంది. ఆనందపురం వద్ద 2.70 టీఎంసీల నీటి ప్రవాహానికి బ్యారేజీ నిర్మాణం చేపడుతున్నారు. 13 తలుపులకుగాను మూడు మాత్రమే ఏర్పాటుచేశారు. మిగతావి ఏర్పాటు చేయాల్సి ఉంది.


సారిపల్లి వద్ద నిర్మాణ దశలో ఉన్న రిజర్వాయర్ గట్టు

సంక్రాంతికి 52 ప్రత్యేక రైళ్లు

- నేటి నుంచి 18వ తేదీ వరకు అందుబాటులో...



హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా పలు ప్రాంతాలకు వెళ్లి వచ్చే ప్రయాణికుల కోసం 52 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 6 నుంచి 18వరకు ఈ రైళ్లు అందుబాటులో ఉంటా యని పేర్కొన్నారు. జనవరి 6, 7 తేదీల్లో చర్లపల్లి-తిరుపతి-చర్లపల్లి (07077/07078), 8, 9, 11, 12, 15, 16 తేదీల్లో చర్లపల్లి-తిరుపతి-చర్లపల్లి (02764/ 02763) మధ్య 6 రైళ్లు అందుబాటులో ఉంటాయి. 13న వికారాబాద్-కాకినాడ టౌన్ (07037), 14న కాకినాడ టౌన్-చర్లపల్లి (07038) మధ్య రైళ్లు నడుస్తాయి. 9, 10, 16, 17 తేదీల్లో కాచిగూడ- తిరుపతి-కాచిగూడ మధ్య నాలుగు, 11, 12, 18, 19 తేదీల్లో చర్లపల్లి-నర్సాపూర్-చర్లపల్లి (07035/07036) మధ్య నాలుగు, 12, 19 తేదీల్లో సికింద్రాబాద్-కాకినాడ టౌన్-సికింద్రాబాద్ మధ్య నాలుగు, జనవరి 7, 8, 9, 10, 13, 14, 15, 16, 17, 18 తేదీల్లో చర్లపల్లి-నర్సాపూర్-చర్లపల్లి (07033/ 07034)మధ్య పది రైళ్లు నడుస్తాయి. 8, 9, 10, 11, 12, 13, 14, 15 చర్లపల్లి-కాకినాడ టౌన్-చర్లపల్లి (07031/ 07032)మధ్య ఎనిమిది, జనవరి 6, 7, 13, 14 తేదీల్లో నాందేడ్-కాకినాడ టౌన్- నాందే డ్ (07487/07488) మధ్య నాలుగు, జన వరి 9, 10, 12, 13, 14, 15 తేదీల్లో చర్లప ల్లి-శ్రీకాకుళం రోడ్-చర్లపల్లి (07025/ 07026) మధ్య ఆరు రైళ్లు అందుబాటులో ఉంటాయి. 7, 8 తేదీల్లో కాచిగూడ-శ్రీకాకుళం రోడ్-కాచిగూడ (07041/ 07042)మధ్య రెండు రైళ్లు నడపనున్నట్లు అధికారులు తెలిపారు.


స్వగ్రామాలకు చేరుతున్న వలస కూలీలు


తిలారు రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సందడి

జలుమూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పనుల నిమిత్తం సుదూర ప్రాంతాలకు వలస వెళ్లిన కూలీలు సంక్రాంతి నేపథ్యంలో స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. సంక్రాంతి మరో వారం రోజులు మాత్రమే ఉండడంతో ఆయా ప్రాంతాల నుంచి రైళ్లు, బస్సుల ద్వారా కుటుంబ సభ్యులతో చేరుతున్నారు. దీంతో రైల్వే స్టేషన్లు, ప్రధాన కూడళ్లు ప్రయాణికులతో కళకళలాడుతున్నాయి. వీరంతా గ్రామాలకు చేరుకుని బంధువులను కలుస్తూ ఆనందం పొందుతున్నారు.

అంతా ఆన్‌లైన్

- పల్లెకు పాకిన సంస్కృతి ● అన్ని వస్తువుల కొనుగోలు అదే విధానంలో..
- యువతకు పెరిగిన ఉపాధి అవకాశాలు



ఇచ్ఛాపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి)

పట్టణాలు, పల్లెలు అన్న తేడా లేకుండా జిల్లాలో ఆన్‌లైన్ వ్యాపారం జోరుగా సాగుతోంది. చేతిలో సెల్‌ఫోన్ ఉండాలే కానీ క్షణాల్లో తమకు నచ్చి, మెచ్చిన వస్తువులు, కిరాణా, ఆహారం, ఇతరత్రా సామగ్రిని తెచ్చుకుంటున్నారు. ఒకప్పుడు నగరాలకే పరిమితమైన సంస్కృతి క్రమేపీ పట్టణాలకు, ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించింది. ప్రజలు ఫ్రీ డెలివరీ వస్తువులకే ప్రాధాన్యం ఇస్తున్నారు. వాటినే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని తెప్పించుకుంటున్నారు. అయితే ఆన్‌లైన్ వ్యాపారాల పుణ్యమా అని స్థానిక వ్యాపారాలు మూతపడ్డాయి.


గతంలో గ్రామాల్లో కిరాణా దుకాణాలకు ఎంతో ఆదరణ ఉండేది. అక్కడే అన్ని వస్తువుల విక్రయాలు చేసేవారు. అయితే ఆన్‌లైన్ లావాదేవీల పుణ్యమా అని గడిచిన ఏడాదిలో దేశవ్యాప్తంగా 2 లక్షల కిరాణా దుకాణాలు మూతపడినట్టు జాతీయ వాణిజ్య సంస్థ స్పష్టం చేసింది. మనిషి దైనందిన జీవితం బిజీగా మారింది. ప్రభుత్వ ఉద్యోగాలు కంటే ప్రైవేట్ ఉద్యోగాలే ఇప్పుడు అధికంగా ఉన్నాయి. ప్రైవేట్ సెక్టారు అంటే ఉరుకులు, పరుగులు పెట్టాల్సి ఉంటుంది. అదే సమయంలో భర్తతో పాటు భార్య పనిచేయాల్సి పరిస్థితి నెలకొంది. అటువంటి వారు ఇంటి అవసరాల కోసం తమ సమయాన్ని కేటాయించే పరిస్థితి ఉండదు. అందుకే వారు ఎక్కువగా ఆన్‌లైన్ ఆర్డర్ల వైపు మొగ్గు చూపుతున్నారు.

తగ్గిపోతున్న దుకాణాలు..

ఆన్‌లైన్ వ్యాపారాలు మూలంగానే ఇండియన్ రిటైల్ రంగంలో కిరాణా దుకాణాలతో పాటు ప్రజలకు అవసరమైన వస్తువులు విక్రయించే షాపుల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పడుతుందని జాతీయ సంస్థలు అంచనాలను వెల్లడిస్తున్నాయి. రాబోయే ఐదేళ్లలో ఆన్‌లైన్ సంస్థలు 1500 శాతం వృద్ధి సాధిస్తాయని చెప్పడం బట్టి అర్థమవుతోంది. అంటే ఏడాదికేడాది 300 శాతం తమ సేవలను విస్తరిస్తాయన్న మాట. అటు ప్రభుత్వానికి సైతం పన్నుల రూపంలో ఆదాయం పెరిగే అవకాశం ఉంది. రాబోయే రెండు, మూడు సంవత్సరాల్లో ప్రభుత్వానికి 300 నుంచి 400 మిలియన్లు ఆదాయం సమకూరుతుందని వాణిజ్య నిపుణులు చెబుతున్నారు. అటు ఈ రంగంలో ఉద్యోగుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది. ఇప్పటివరకూ ఈ సంస్థల్లో సగటు ఉద్యోగికి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ జీతం ఉండేది. కానీ ఇప్పుడు రూ.25 వేలకు పెరిగే అవకాశాలు కూడా ఉన్నాయి. భారతీయ రైల్వే కంటే ఈ రంగంలో ఉద్యోగాల భర్తీ పెరుగుతుందని తెలుస్తోంది.

యువతకు ఉపాధి..

ప్రస్తుతం పట్టణంలో అమేజాన్, క్లిప్‌కాట్, డెలివరీ డాట్‌కమ్, ఎక్స్‌ప్రెస్ ఇలా చాలా సంస్థలు తమ కార్యకలాపాలు సాగిస్తున్నాయి. వాటివల్ల స్థానిక నిరుద్యోగ యువత పనుల్లో చేరి జీవితాన్ని గడుపుతున్నారు.




ఇచ్ఛాపురం పట్టణంలో ఆన్‌లైన్ వస్తువులు డెలివరీ చేస్తున్న బాయ్స్

● ఈయన పేరు సింహాచలం.

ఇచ్ఛాపురం మునిసిపాలిటి గొల్లవీధికి చెందిన ఈయన ఆన్‌లైన్ డెలివరీ బాయ్. పట్టణాల కంటే గ్రామీణ ప్రాంత ప్రజలే ఎక్కువగా ఆన్‌లైన్ మార్కెట్ చేస్తుంటారని సదరు యువకుడు చెబుతున్నాడు. రోజుకు 50 కిలోమీటర్లు తిరుగుతామని తెలిపాడు. 'మొదట్లో పార్శిల్ బట్టి కమీషన్ వచ్చేది. ప్రస్తుతం నెలకు రూ.13వేలు వస్తోంది. ఈ వర్క్ హ్యాపీగానే ఉంది. రోజుకి వంద పార్శిల్స్ వచ్చినా.. ఒక్కటి వచ్చినా జీతం మాత్రం ఒక్కటే. ఈ ఉద్యోగం చాలా ఆనందాన్ని కలిగిస్తోంద'ని సింహాచలం తెలిపాడు.

● **అన్నింటా ఆదా..**

ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలుతో సమయంతో పాటు డబ్బులు ఆదా అవుతోంది. అందుకు తగ్గట్టు ఆన్‌లైన్ వ్యాపార సంస్థలు కూడా నాణ్యతకు పెద్దపీట వేస్తున్నాయి. వివిధ పనులపై బయటకు వెళ్లినవారు ఇంటికి చేరే లోపు నిత్యావసరాలతో పాటు ఆహారం కూడా ఇట్టే చేరిపోతుంది. ముఖ్యంగా దంపతులిద్దరూ ఉద్యోగాలు చేస్తే వారికి క్విక్ కామర్స్ సంస్థలే కుటుంబ సభ్యులు అండగా నిలుస్తాయి.

-తిప్పన లక్ష్మణరావురెడ్డి
స్థానికుడు, ఇచ్ఛాపురం

ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్‌గా మురళి

విజయనగరం రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎన్జీవో హోంలో ఆదివారం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు జోగారావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో గోవిందపురం జడ్పీ హైస్కూల్ ఫిజిక్స్ ఉపాధ్యాయుడు మద్దంశెట్టి మురళీని రాష్ట్ర కౌన్సిలర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన మురళీని రాష్ట్ర పరిశీలకుడు ఎస్.వి. రమణమూర్తి, జిల్లా ప్రతినిధులు జోగారావు, చిప్పాడ సూరిబాబు, ఎస్.చిట్టిబాబు, ఎం.ఎ.స్వామి, ఎస్. బంగారయ్య, రవి, టి.నాగేశ్వరరావు, బి.ఈశ్వరరావు అభినందించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే

లక్కవరపుకోట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస మండలం వీరభద్రాపురం గ్రామానికి చెందిన ఐ.మహాలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మరణించిన నేపథ్యంలో ఆమె కుటుంబానికి రూ.1,41,616 సీఎం సహాయనిధి మంజూరైంది. ఆదివారం ఆ మొత్తానికి సంబంధించిన ఉత్తర్వులను ఎల్.కోటలో ఎమ్మెల్యే లలితకుమారి వారికి అందజేశారు.

పర్తియాత్రను విజయవంతం చేద్దాం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

రేగిడి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి శతజయంతి వేడుకలు పురస్కరించుకుని మార్చి నెలలో నిర్వహించాల్సిన యువత పర్తియాత్ర సమష్టిగా విజయవంతం చేద్దాం అని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు సునీల్‌కుమార్ రదో పిలుపునిచ్చారు. ఆదివారం రేగిడి విశ్వసాయి మందిరంలో రాజాం డివిజన్ సత్యసాయి సేవాసంస్థల ప్రతినిధులు. జిల్లా పదాధికారుల సమక్షంలో బాబా శతజయంతి వేడుకల నిర్వహణ, పర్తియాత్రపై సమావేశం నిర్వహించారు. బాబా విశిష్టతపై పుస్తకాన్ని ఆవిష్కరించారు. జోన్-7 కన్వీనర్ రాజు, జిల్లా స్టడీ సర్కిల్ ఇన్‌చార్జి సత్యనారాయణ పాల్గొన్నారు.

విదర్భ జైత్రయాత్ర

- విజయ్ హజారే టోర్నీలో వరుసగా ఆరో విజయం
- 10 వికెట్ల తేడాతో మిజోరంపై తమిళనాడు గెలుపు
- 72 పరుగులకే కుప్పకూలిన మిజోరం
- ఛత్తీస్‌గఢ్ జట్టుపై 73 పరుగులతో గెలుపొందిన తమిళనాడు



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అందుకుంటున్న తమిళనాడు బ్యాట్స్‌మన్

విజయనగరం టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విజయనగరం వేదికగా బీసీసీఐ ఆధ్వర్యంలో జరుగుతున్న దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో విదర్భ జట్టు జైత్రయాత్ర కొనసాగుతోంది. వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో గెలుపొంది, లీగ్ దశను ఘనంగా ముగించింది. గ్రూప్-డిలో 26 పాయింట్లతో టాపర్‌గా నిలిచింది. అలాగే తమిళనాడు జట్టు ఐదు మ్యాచ్‌ల్లో నాలుగు గెలుపొంది 18 పాయింట్లతో రెండో స్థానం లో నిలిచింది.

10 వికెట్లతో విదర్భ గెలుపు

జిల్లాలోని డెంకాడ మండలం చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో విదర్భ, మిజోరం జట్ల మధ్య ఆదివారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో బలమైన విదర్భ జట్టు, బలహీనమైన మిజోరం జట్టుపై 10 వికెట్ల తేడాతో గెలుపొందింది. ముందుగా టాస్ గెలిచిన విదర్భ జట్టు కెప్టెన్ కరుణ్‌నాయర్ ఫీల్డింగ్‌కు మొగ్గు చూపాడు. దీంతో బ్యాటింగ్ ఆరంభించిన మిజోరం జట్టు విదర్భ జట్టు బౌలర్ల దాటికి 22.1 ఓవర్లలో 72 పరుగులకే కుప్పకూలింది. జట్టు బ్యాటర్లలో లాల్‌హ్రిత్తంగ (10 పరుగులు), మార్టి (23 పరుగులు), పర్వేజ్ (11 పరుగులు)లు మాత్రమే రెండంకెల స్కోర్లు సాధించారు. విదర్భ జట్టు బౌలర్లలో దూబే 4, థాక్రే, యష్‌కాదమ్ రెండేసి వికెట్లు సాధించారు. అనంతరం 73 పరుగుల స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన విదర్భ ఆ జట్టు కేవలం 8.5 ఓవర్లలోనే 73 పరుగులు చేసి విజయ లక్ష్యాన్ని అందుకుంది. జట్టు ఓపెనింగ్ బ్యాటర్లు అథర్వ తైదే 21 పరుగులు, ఏవీ వాంఖడే 50 పరుగులు చేసి జట్టుకు విజయాన్ని అందించారు. విదర్భ జట్టు బౌలర్ హర్ష దూబేకు ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది.

73 పరుగుల తేడాతో తమిళనాడు విజయం

నగరంలోని విజ్జీ క్రికెట్ మైదానం వేదికగా తమిళనాడు, ఛత్తీస్‌గడ్ జట్ల మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు జట్టు 73 పరుగుల తేడాతో గెలుపొందింది. టాస్ గెలిచిన ఛత్తీస్‌గడ్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్ ఆరంభించిన తమిళనాడు జట్టు టీమిండియా మాజీ ఆటగాడు విజయ్‌శంకర్ (71 పరుగులు), ఇంద్రజిత్‌లు (75 పరుగులు) రాణించడంతో నిర్ణీత 50 ఓవర్లలో 301 చేసి ఆలౌటైంది. అనంతరం 302 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన ఛత్తీస్‌గడ్ జట్టు 46 ఓవర్లలో 228 పరుగులు చేసి ఆలౌటై పరాజయం పాలైంది. జట్టు ఓపెనింగ్ బ్యాటర్లు లాల్వాని (45 పరుగులు), అశుతోష్ సింగ్ (71 పరుగులు) అర్థ సెంచరీలతో రాణించినా, మిగతా బ్యాటర్లు రాణించకపోవడంతో జట్టు ఓటమి చవిచూసింది. 71 పరుగులతో రాణించిన తమిళనాడు బ్యాటర్ విజయ్‌శంకర్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి

మక్కువ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని కన్నంపేట బీసీ కాలనీ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ ఎం.శ్రీనివాసరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కన్నంపేట గ్రామానికి చెందిన మత్స తిరుపతి(73) కన్నంపేట కాలనీలో ఆదివారం జరిగిన ఓ విందుకు హాజరయ్యారు. భోజనం అనంతరం తిరిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా.. బొబ్బిలి నుంచి మక్కువ వైపునకు ధాన్యం లోడుతో వస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొంది. దీంతో ఎడమ కాలు పాదం, కుడితొడ వద్ద బలమైన గాయాలయ్యాయి. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. కుమారుడు మత్స రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రాజాంలో మరొకరు..



ఉత్తరకుమార్ (ఫైల్ ఫొటో)

రాజాం రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాజాం మునిసిపాలిటీ పరిధిలోని కొండంపేట గ్రామానికి చెందిన గుడివాడ ఉత్తరకుమార్(57) ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. మండలంలోని రాజీపేట నుంచి రాత్రి 10 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరాడు. రాజీపేట సమీపంలో ఆగి ఉన్న కలప ట్రాక్టరును ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో ఉత్తరకుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. రాజాం టౌన్ సీఐ అశోక్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఉత్తరకుమార్ మృతిపై ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సంతాపం తెలిపారు.

ముగ్గురిపై పోక్సో కేసు

పార్వతీపురం రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేసిన ముగ్గురు యువకులపై స్థానిక పోలీసులు శనివారం పోక్సో కేసు నమోదు చేశారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు అదే గ్రామానికి చెందిన బాలికపై పలు పర్యాయాలు అత్యాచారం చేశారు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు నిర్వహించి ముగ్గురిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఇందులో ఒక మైనర్ కూడా ఉన్నాడు. ఈ ఘటనపై రూరల్ ఎస్ఐ సంతోషికుమారి ఆదివారం మాట్లాడుతూ ముగ్గురిపై పోక్సో కేసు నమోదు చేసి, పోలీస్ కస్టడీలోకి తీసుకున్నామని చెప్పారు.

లారీ ఢీ: యువకుడికి గాయాలు

సీతానగరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొని యువకుడికి గాయాలైన ఘటన చినభోగిలి సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. గరుగుబిల్లి మండలం రావుపల్లి గ్రామానికి చెందిన గడిదేసి రాంబాబు విశాఖపట్నంలో పోటీ పరీక్షలకు కోచింగ్ తీసుకుంటున్నాడు. ఆదివారం ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తున్నాడు. చినభోగిలి సమీపంలోకి వచ్చేసరికి పార్వతీపురం నుంచి వస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొంది. దీంతో రాంబాబు తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు స్పందించి అరవత్తిపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించారు. దీనిపై ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేశారు.

గడ్డి కుప్ప దగ్ధం

పాలకొండ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏలాం గ్రామ సమీపంలో ఆదివారం వరి గడ్డి కుప్ప దగ్ధమయ్యింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఏళ్ల తరబడి పశువుల దాణా కోసం ఉంచిన గడ్డి పోయిందని యజమాని పురె దాలినాయుడు ఆవేదన చెందుతున్నాడు. సుమారు 15 ఎకరాలకు సంబంధించిన గడ్డి వాము దగ్ధమైందని, రూ.60 వేలు నష్టం వాటిల్లిందని తెలిపారు.

బెల్లం ఊటలు ధ్వంసం

విజయనగరం క్రైం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస మండలం ముషిరాం గ్రామ శివార్లలో 450 లీటర్లు పులిసిన బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఇందిరాదేవి తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు ఇచ్చిన సమాచారంతో వాటిని ధ్వంసం చేసి తదుపరి చర్యలు నిమిత్తం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కొత్తవలస స్టేషన్‌కు అప్పగించినట్టు తెలిపారు. దాడుల్లో హెచ్‌సీ నాగేశ్వరరావు, ఈసీలు నాయుడు, మనోజ్, జనార్దన్ పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

భోగాపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కోడిపందేలు, పేకాటలు నిర్వహిస్తే చర్యలు తప్పవని సీఐ ఎన్.వి.ప్రభాకర్ హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ సమీపిస్తున్న నేపథ్యంలో ఎక్కడైనా కోడిపందాలు, పేకాట నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. గతంలో కోడిపందాలు, పేకాటలో అరెస్టయిన వారిని బైండోవర్ చేస్తున్నామన్నారు. కోడి పందేలు, కోడి కత్తులు తయారీ చేసేవారు, కోడి కత్తులు కట్టిన వారిపై నిఘా పెట్టామని సీఐ స్పష్టం చేశారు.

ట్రాక్టర్ మాయంపై ఫిర్యాదు

రాజాం రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామానుజులపేట గ్రామానికి చెందిన పడాల వెంకటేశ్ తన ట్రాక్టరు కనిపించడంలేదని ఆదివారం రాత్రి రాజాం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నెల 2న మండలంలోని మొగిలివలస సమీపంలోగల పెట్రోల్ బంకు వద్ద ట్రాక్టరును ఉంచి తన గ్రామానికి వెళ్లాడు. తిరిగి 3న బంకు దగ్గరకు వెళ్లి చూడగా ట్రాక్టరు లేకపోవడాన్ని గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు ఎస్ఐ రవికిరణ్ కేసు నమోదు చేశారు.

క్షతగాత్రులకు రూ.50వేల సాయం

భోగాపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై విశాఖలో చికిత్స పొందుతున్న రావాడ గ్రామానికి చెందిన గొంప సాగర్, కొయ్య జగన్మోహన్‌రెడ్డిలకు జనసేన మండల పార్టీ అధ్యక్షుడు వందనాల రమణ, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యుడు బొల్లు త్రినాథ్, జనసేన నాయకులు రూ.50 వేలు ఆర్థికసాయం చేశారు. ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆదేశాలకు బాధితుల కుటుంబాలను ఆదివారం వారు కలిసి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో రాధాకృష్ణారెడ్డి, చెల్లుబోయిన రాము, సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

రాజాం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని జిల్లా అగ్నిమాపక అధికారి జడ్డు మోహనరావు అన్నారు. ఆదివారం పొగిరి గ్రామంలో శాసుబిల్లి సాయిశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జడ్డు విష్ణుమూర్తి ఎంపీటీసీ మాజీ సభ్యుడు సుపల జగన్మోహన్‌రావు, పొగిరి లెనిన్‌బాబు, జడ్డు జగదీశ్వరరావు, సనపల జగన్మోహన్ పాల్గొన్నారు.

మహేశ్‌ను పరామర్శించిన కోండ్రు



మహేశ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

రాజాం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీసీ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యుడు కర్నేని మహేశ్వరరావును ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆదివారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచిం చారు. ఆయనతో పాటు రాజాం మండల పార్టీ అధ్యక్షుడు సుమల మన్మథరావు. దుప్పలపూడి శ్రీనివాసరావు, దూబ ధర్మారావు తదితరులు ఉన్నారు.

సాయన్న చానల్‌పై నిర్లక్ష్యం వద్దు

రేగిడి, జనవరి 5, (ఆంధ్రజ్యోతి): సాయన్న చానల్, దాని అనుబంధ కాలువలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించరాదని సంకిలి, దేవుదళ, చిన్నయ్యపేట, బొడ్డవలస రైతులు నీటిసంఘం అధ్యక్షుడు నారు జనార్దనరావును కోరారు పూడికలు తీయించడంతో పాటు షట్టర్లు బిగించే ఏర్పాటు చేయాలని విన్నవించారు.

స్థిరాస్తి కొనుగోలుకు ఎక్స్‌పో దోహదం



క్రెడాయ్ ప్రాపర్టీ షోని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం రింగురోడ్డు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థిరాస్తి కొనుగోలుకు క్రెడాయ్ ఎక్స్‌పో ఉపయుక్తంగా ఉంటుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రింగురోడ్డు వద్ద లీ ప్యారడైజ్ కన్వెన్షన్ హాల్‌లో క్రెడాయ్ ఆధ్వర్యంలో ప్రాపర్టీ షోని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాలు చేపట్టేవారు, స్థలాలు కావల్సిన వారు నిర్మాణాలు చేయదలచిన వారికి ఈ ప్రాపర్టీ షో ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. క్రెడాయ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ఈ నెల 7 వరకూ క్రెడాయ్ ప్రాపర్టీ షోని నిర్వహిస్తామన్నారు. ఇక్కడ గృహ నిర్మాణ రంగానికి అవసరమైన సుమారు వంద రకాల స్టాళ్లు, ఇంటీరియల్ డెకరేషన్స్ లిఫ్టులు, ఆటోమొబైల్స్ వీఎంఆర్‌డీఏ ప్లాట్స్, డూప్లెక్స్ విల్లాస్, జనరేటర్స్, సోలార్ ఎనర్జీకి సంబంధించిన స్టాల్స్‌ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో క్రెడాయ్ ప్రతినిధులు పార్థసారధి, సూర్యనారాయణరాజు, కిలాని రాజశేఖర్, జి.వి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ తగదు'



బహిరంగ సభలో ఐక్యత చాటుతున్న మాలల సంఘ ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నగరంలోని గురజాడ కళాక్షేత్రం వేదికగా మాలలు గర్జించారు. ఆదివారం జరిగిన గర్జన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ హర్షకుమార్, సమతా సైనికదళ్ జాతీయ కార్యదర్శి దిగంబర కాంబ్లేతో పాటు జాతీయ, రాష్ట్రస్థాయిలోని మాలల సంఘ ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉత్తరాంధ్ర పరిధిలోని మూడు ఉమ్మడి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో మాలలు తరలి వచ్చి ఈ సభను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో మాజీ ఎంపీ హర్షకుమార్ మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు మాలలపై కక్ష కట్టారని ధ్వజమెత్తారు. వీరంతా ఒక ప్లాన్ ప్రకారం మాలలను విడదీసే కుట్రకు శ్రీకారం చుట్టారన్నారు. ఎప్పటి నుంచో జరుగుతున్న ఈ కుట్రలను అన్ని స్థాయిల్లోనూ మాలలు అడ్డుకున్నారన్నారు. కాని అధికారంలో ఉన్న ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు.. మాలలను విడదీసి, రాజకీయంగా వారి పునాదులు బలం చేకూర్చుకునే ప్రయత్నాలు చేశారన్నారు. మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి కూడా మాదిగల వైపే నిలబడి, మాలలను అన్యాయం చేశారన్నారు. జనగణన జరిగాల్సిందేనన్నారు. జనగణనకు ఎందుకు కేంద్ర ప్రభుత్వం వెనుకడుగు వేస్తుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రధాన సమస్యలు ఉండగా, వాటి నుంచి బయట పడేందుకే ఎస్సీ వర్గీకరణను తెరపైకి తెచ్చారన్నారు. ఈ ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరుగుతుంటే, ఎందుకు మౌనం వహిస్తోందో చెప్పాలని డిమాండ్ చేశారు. సమతా సైనికదళ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దిగంబర కాంబ్లే మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ద్వారా మాలలను విభజించే కుట్ర జరుగుతుందన్నారు. మాలలు ఐక్యంగా పోరాడాలని, వర్గీకరణ అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాలల సంఘ ప్రతినిధులు మల్లెల వెంకటరావు, బి.రాము, బి.వి.రమణ, కృష్ణారావు, పైడిరాజు, వి. జైహింద్‌కుమార్, భానుమూర్తి, ఆదాడ మోహనరావు, అప్పారావు, శివ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానానికి స్టీల్ ప్లేట్ల వితరణ



స్టీల్ ప్లేట్లను అందజేస్తున్న దృశ్యం

నెల్లిమర్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామివారి దేవస్థానం నిత్య అన్నదాన పథకానికి విజయనగరం ఇన్నర్ వీల్ క్లబ్ ఉమెన్స్ ఫ్రెండ్‌షిప్ అసోసియేషన్ మహిళలు 50 స్టీల్ ప్లేట్లను వితరణ చేశారు. ఆదివారం వాటిని అసోసియేషన్ ఛైర్‌పర్సన్ లక్ష్మీశ్రీనివాస్ దేవస్థానం సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యాలయ సిబ్బంది రామారావు, రాంబాబు, అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, గొడవర్తి నరసింహాచార్యులు, అసోసియేషన్ మహిళలు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



53 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

శృంగవరపుకోట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట ప్రభుత్వ బాలుర పాఠశాలలో 1970-71లో టెన్త్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం సందడిగా జరిగింది. 53 ఏళ్ల తర్వాత అందరూ కలుసుకుని అలనాటి సంగతులు పంచుకున్నారు. పూర్వ విద్యార్థుల కలయికకు కృషి చేసిన వానపల్లి అప్పలమూర్తి, చింతా సత్యన్నారాయణ, పుల్లేటి సన్యాసిరావు, పెదగాడి ప్రసాద్‌లను సత్కరించారు.

నాలుగు రోజులుగా తాగునీరు బంద్

- రోడ్డు విస్తరణలో పైపులైన్లు ధ్వంసం
- తామేం చేయలేమంటున్న ఆర్అండ్‌బీ
- దిక్కుతోచని స్థితిలో మున్సిపాలిటీ
- ఇబ్బందులు పడుతున్న రాజాం వాసులు



మార్చాల్సిన పైపులైన్లు ఇవే..

రాజాం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్టుంది రాజాం మునిసిపాల్టీ పరిస్థితి. మేజర్ పంచాయతీగా ఉన్న రాజాం నగర పంచాయతీగా మారింది. ఆతర్వాత మునిసిపాల్టీగా అవతరించింది. కానీ రెండు దశాబ్దాలుగా పాలకవర్గాలు లేవు. అదే పట్టణ ప్రజలకు శాపంగా మారింది. నాలుగు రోజులుగా పట్టణా నికి తాగునీటి సరఫరా నిలిచిపో యినా పట్టించుకునే దిక్కులేదు. పైపులైన్లు ధ్వంసం కావడంతో నీరం దించలేమని అధికారులు చేతులెత్తే యడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. మునిసిపాల్టీలో 24 వార్డులు ఉన్నాయి. శివారు కాలనీలు సైతం ఉన్నాయి. రాజాం సమగ్ర మంచినీటి పథకం ద్వారా నీటి సరఫరా అవుతోంది. సంకిలి సమీపంలో నాగావళి నదిలో ఇన్‌ఫిల్టరేషన్ బావులు తవ్వారు. అక్కడ భారీ పంపు హౌస్‌లు ఏర్పాటు చేశారు. భారీ సామర్థ్యంతో ఉన్న మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నారు. శుద్ధి చేసి పైపులైన్ల ద్వారా రాజాం మునిసిపాల్టీకి నీరు సరఫరా చేస్తున్నారు. అయితే కొద్దిరోజులుగా మునిసిపాల్టీలో రోడ్ల విస్తరణ పనులు చేపడుతున్న సంగతి తెలిసిందే. ఈ పనులు ఒక అడుగు ముందుకేస్తే.. ఆరు అడుగులు వెనక్కి అన్న చందంగా మారాయి. రోడ్డు పనుల మాట దేవుడెరుగు కానీ.. వాటి మాటున పైపులైన్లను మాత్రం ధ్వంసం చేశారు. దీంతో పైపులైన్ లీకులు కావడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ప్రధానంగా పాలకొండ రహదారిలో ప్రధాన పైపులైన్ ధ్వంసం కావడంతో రెండు రోజులుగా పూర్తిగా పట్టణంలో నీటి సరఫరాను నిలిపివేశారు. సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులను అడుగుతుంటే ప్రత్యామ్నాయ పైపులైన్ వేసుకోవాలని సూచిస్తున్నారు. మునిసిపల్ అధికారులు మాత్రం ఇప్పటికప్పుడు ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్నారు ముఖ్యంగా పాలకొండ రోడ్డులోని కేర్ ఆసుపత్రి కూడలివద్ద ఉన్న పైపులైన్లు మార్పు చేయడానికి ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ దుస్థితి నెలకొంది. అంతేకాకుండా తాగునీరు సరఫరా విషయమై అధికారులు ముందుగా ప్రకటన చేయకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించినప్పటి నుంచి తాగునీటి కష్టాలు ఉంటున్నాయి. శివారు కాలనీల ప్రజలు గుక్కెడు నీటి కోసం అల్లాడి పోతున్నారు. మరికొందరు నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి దాపురించింది. రాజాం మున్సిపాలిటీ నుంచి పన్నుల రూపంలో ఏటా రూ.10 కోట్లు ప్రభుత్వానికి సమకూరుతోంది. కానీ ఆ స్థాయిలో ప్రజలకు వసతులు మాత్రం సమకూరడం లేదు. మంచినీటిని కూడా ఇచ్చుకోలేని స్థితిలో మున్సిపాలిటీ ఉందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

ముందుగా సమాచారం అందించాలి

తాగునీటి సరఫరా ఉండదనే విషయం అధికారులు ముందుగా సమాచారం ఇవ్వడం లేదు. దీని కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు సమాచారం ఇస్తే ప్రత్యామ్నాయం చూసుకుంటాము.

-బీఎస్ నాయుడు, డోలపేట



తాగునీటి కోసం చూస్తున్న మహిళలు

రెండు రోజులుగా నీరులేదు..

పట్టణంలో తాగునీటి సరఫరా నిలిచిపోవడం నిజమే. సంకలి నుంచి వచ్చే పైపులైన్ రోడ్డు విస్తరణ పనుల్లో ధ్వంసమైంది. ఆర్అండ్‌బీ అధికారులు మరో పైపులైన్ ఏర్పాటు చేయాలంటున్నారు. ఈ విషయంలో ఎలా ముందుకెళ్లాలో తెలియక ఉన్నతాధికారులకు నివేదించాం. వారిచ్చిన సూచనలతో ప్రస్తుతం పైప్‌లైన్ మరమ్మత్తు పనులు చేపడుతున్నాం.

-వెంకటయ్య ఏఈ,
రాజాం మునిసిపాల్టీ

అంగన్‌వాడీకి చిన్నారులను పంపలేం..

- హైవేను దాటించడానికి తల్లుల భయాందోళన
- 15 రోజులుగా పిల్లలకు అందని పౌష్టికాహారం



చిన్నారులను అంగన్‌వాడీకి పంపించలేమని చెబుతున్న తల్లులు

శృంగవరపుకోట రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి మీదుగా కిలోమీటరు దూరంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి మా పిల్లలను పంపించాల్సి వస్తోంది.. వారు వెళ్తున్న క్రమంలో ఏదైనా జరగరానిది జరిగితే దానికి బాధ్యులెవరు... మాకు అలాంటి కడుపుకోత వద్దు.. ఇదీ మండలంలోని ముషిడిపల్లి పంచాయతీ దొర్లపాలెంలోని చిన్నారుల తల్లులు. దొర్లపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఇటీవల బందవలసకు అధికారులు తరలించారు. అయితే బందవలసలో నలుగురే చిన్నారులు ఉండగా, దొర్లపాలెం నుంచి ప్రతి రోజు కిలోమీటరు మేర దూరం నడిచి ఏడుగురు చిన్నారులు అంగన్‌వాడీకి వెళ్తున్నారు. అయితే జాతీయ రహదారిని దాటి చిన్నారులు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొనడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో చిన్నారులు ఇళ్లకు చేరే వరకూ వారు బిక్కుబిక్కుమంటున్నారు. రోజూ ఇలా భయపడట కన్నా అంగన్‌వాడీకి పంపించకపోవడమే మేలనే అభిప్రాయానికి తల్లులు వచ్చేశారు. దాంతో 15 రోజులుగా మూకుమ్మడిగా చిన్నారులను అంగన్‌వాడీకి పంపించడం మానేశారు. గత మాదిరి దొర్లపాలెంలో అంగన్‌వాడీ ఏర్పాటు చేస్తే పిల్లలను పంపుతాం. అప్పటి వరకూ వారు ఇచ్చే పౌష్టికహారం తీసుకోమని తెగేసి చెబుతున్నారు. ఈ విషయంపై గ్రామ యువత మట్లాడుతూ గత నెలలో కలెక్టర్ గ్రీవెన్స్‌లో అంగన్‌వాడీ కేంద్రం మార్పు విషయం ఫిర్యాదు చేశామన్నారు. రాజకీయ ఒత్తిళ్ల మేరకే అంగన్‌వాడీ తరలిపోయిందన్నారు. ఐసీడీఎస్ పీవో ఉమ మాట్లాడుతూ గడిచిన 15 రోజులుగా చిన్నారులు బందవలస అంగన్‌వాడీకి వెళ్లడం లేదని గుర్తించమన్నారు. బందవలస పేరుపై గతంలో అంగన్‌వాడీ కేంద్రం మంజూరైందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు ఈ విషయం తెలియజేశామన్నారు. పండుగ తరువాత సమస్యకు పరిష్కారం లభించవచ్చన్నారు.

ఖాళీ స్థలాలను పేదలకు అప్పగించాలి

● సీపీఐ నాయకుల డిమాండ్



నకిలీ పట్టాల ప్రతులను చూపిస్తున్న సీపీఐ నాయకులు

బొబ్బిలి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఖాళీస్థలాలను నిరుపేదలకు అప్పగించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బొబ్బిలి పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో గత ప్రభుత్వహయాంలో ఖాళీ స్థలాల కబ్జా, అక్రమ వ్యాపారాలపై అధికారులు ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారని ప్రశ్నించారు. ఆదివారం ఇందిరమ్మకాలనీలో నిర్వ హించిన కార్యక్రమంలో సీపీఐ నాయ కులు కోట అప్పన్న, మునకాల శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. నకిలీ పట్టాలను సృష్టించి, పేదల ఇళ్ల స్థలాలను కబ్జా చేసి లక్షలాది రూపా యల వ్యాపారాలను అక్రమ వ్యాపారాలను సాగించిన వారిపై అధికార యంత్రాంగం ఎం దుకు ఉదాసీనంగా వ్యవహరిస్తుందో అర్థం కావడం లేదన్నారు. ప్రజాసంఘాలు ధర్నాలు, ఆందోళనలు చేస్తున్న ప్రతిసారీ మొక్కుబడిగా ఒకటి రెండు చిన్నపాటి రేకుల షెడ్లను తొలగించి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. అధికారులు చొరవతీసుకొని నకిలీ పట్టాల జారీలో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చెరువులపై దృష్టి సారించండి

● ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణమూర్తినాయుడు

బొబ్బిలి రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): చెరువులపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మరిశర్ల కృష్ణమూర్తినాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం బొబ్బిలిలో ఏర్పాటుచేసిన కార్య క్రమంలో ఆయన మాట్లాడుతూ చెరువులు ఆక్రమణలకు గురికావడంతో ఆయకట్టుకు సాగునీరందడంలేదని తెలిపారు. చెరువులు, నీటి వనరులు, ఆక్రమణలు తొలగించకుండా భూసమస్యలు పరిష్కారమైపోయాయని చెప్పడంహాస్యాస్పదం ఉందన్నాను.మండల స్థాయిలో అధికారులు సమన్వయంతో చెరువులు, నీటి వనరుల వాస్తవ పరిస్థితిపై నివేదికలు తెప్పించుకొని వాటిని కాపాడవలసిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. కలెక్టర్ స్పందించి చెరువులను పరిరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలని కోరారు.

రైతులను మోసగిస్తున్న వారిపై చర్య తీసుకోవాలి

బొబ్బిలి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): అధికంగా తూకం వేసి రైతులను మోసగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సాంబయ్య డిమాండ్ చేశారు. ఆదివారం బొబ్బిలిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంచి పరిపాలన అందుతుందని ఆశించిన ప్రజలకు పూర్తి నిరాశే ఎదురైందన్నారు. వినియోగదారులకు కావాల్సిన మద్యం రకాలను అందుబాటులో ఉంచకుండా ఉద్దేశ పూర్వకంగానే వ్యాపారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. రైతులను దళారులు దోపిడీ చేస్తున్నా, వారిని నియంత్రించే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం ఇచ్చిన రైతులకు 24 గంటల్లోగా బిల్లులను చెల్లిస్తామని చెప్పారని, కొంతమంది రైతులకు 24 రోజులైనా బిల్లులు అందని పరిస్థితి నెలకొందన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా తమకు కడగండ్లు తప్పడం లేదన్న నిశ్చితాభిప్రాయంలో ప్రజలు ఉన్నారన్నారు.



వ్యాన్‌లో కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న దృశ్యం



వంగరలో చేపల పెంపకం చేపడుతున్న ఓ చెరువు

పర్యవేక్షణ లేక.. నిబంధనలు పాటించక

● చెరువుల్లో చేపలకు మేతగా కోళ్ల వ్యర్థాలు ● ప్రజారోగ్యంతో చెలగాటం ● చోద్యం చూస్తున్న అధికారులు

వంగర, జనవరి 5 (ఆంధ్రజ్యోతి)

కొందరు చేపల చెరువుల యజమానులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందాలన్న ఉద్దేశ్యంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రమాదకరమని తెలిసినా కోళ్ల ఇతర జంతు వ్యర్థాలను చేపలకు మేతగా వేస్తున్నారు. ఈ వ్యవహారంపై పర్యవేక్షించి చర్యలు తీసుకోవల్సిన మత్స్యశాఖ అధికారులు చోద్యంచూస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి. అధికారుల ఉదాసీనత వల్ల పెంపకందారులు నిబంధనలు బేఖాతర్ చేస్తున్నారు. దీనికితోడు నిషేధిత ఆహారాన్ని చేపల పెంపకానికి వినియోగిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

వంగర మండలంలోని సంగాం, వంగర, దేవకివాడ, మగ్గూరు గ్రామాల్లో గల చెరువుల్లో చేపలను పెంచుతున్నారు. చేపల పెంపకందారులు ఆహారంగా వివిధ రకాల ఫీడ్‌ను అందజేస్తున్నారు. బహిరంగ మార్కెట్లో ఫీడ్ ధర అధికంగా ఉండడంతో స్థానికంగా లభించే కోళ్ల తదితర వ్యర్థాలను కొందరు ఫీడ్‌గా వినియోగిస్తున్నారు. రాజాం నియోజకవర్గంలోని పలుచోట్ల చికెన్ దుకాణాలు ఇటీవల అధికంగా వెలిశాయి. ఇక్కడ లభ్యమయ్యే వ్యర్థాలు చెరువుల్లో చేపలకోసం మోతగా వినియోగించుకోవడానికి కొందరు చేపల పెంపకందారులు చికెన్‌దుకాణాల నిర్వాహకులతో ఒప్పందం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రాజాంతో పాటు చీపురుపల్లి, పొందూరు తదితర ప్రాంతాల నుంచి నిత్యం వాహనాల్లో చికెన్ వ్యర్థాలు గ్రామీణ ప్రాంతాల్లోని చెరువుల వద్ద తరలించి, మేతగా వినియోగిస్తున్నారు.

ప్రభుత్వం నిషేధించినా..

రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిదేళ్ల కిందట కోళ్ల వ్యర్థాలను చేపలకు మేతగా వేయడాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసినా ఇక్కడ ఆ ఉత్తర్వులు అమలుకు నోచుకోవడం లేదు. ఈనేపథ్యంలో ఒక్కో దుకాణానికి ఏడాదికి రూ.10 వేలు నుంచి రూ.15 వేలు వరకు చెల్లించేలా ఒప్పందం చేసుకుం టున్నారు. దుకాణాల నుంచి వ్యర్థాలు సేకరించే సమయంతో పాటు వ్యర్థాలు ప్రధానరహదారిలో వెళ్తున్న సమయంలో దుర్వాసనకు ప్రజలు, బాటసారులు, వాహనచోదకులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

ఖర్చు తడిసిమోపెడు..

చెరువుల్లో చేపల పెంపకం దారులు మేత ఖర్చు తడిసి మోపెడవుతోంది. మేతగా వేసే వేరుశనగ చెక్క ధర అధి కంగా పలుకుతోంది. దీంతో ఆరు నెలలకు సగటున రూ.మూడు లక్షలు వరకు ఖర్చవుతోంది. అదే కోళ్ల వ్యర్థాలు మేతగా వేస్తే రూ.లక్షలోపే ఖర్చవుతుందని చెరువుల్లో చేపలు పెంచే నిర్వాహకులు చెబుతున్నారు. సంప్రదాయ చేపల మేత కిలో రూ.35 ఉండగా కోళ్ల వ్యర్థాలు కేవలం రూ.10కే దొరుకుతున్నాయి. ఎకరా చేపల చెరువుకు సంప్రదాయ మేతకు రోజుకు రూ.20 కిలోలు అంటే రూ.700 అవుతుంది. కూలీకి మరో రూ.200 కలుపుకొని నెలకు రూ.25 వేలు అవుతుంది. అదే కోళ్ల వ్యర్థాలు 200 కిలో డ్రమ్ము సుమారు రూ. రెండు వేలకే లభిస్తుందని పలువురు చెబుతున్నారు. నెలకు రూ.14 వేలతోగట్టెక్కవచ్చు. సాధారణంగా మాంసం వ్యర్థాలు డంపింగ్ యార్డుకు తరలించాలి. అయితే చెరువుల్లో చేపల పెంపకందారులు వినియోగిస్తుండడంతో దుకాణ యజమానులు చేపల చెరుకు విక్రయిస్తున్నారు.

ఇవీ నిబంధనలు..

● గ్రామాల్లోని చెరువుల్లో చేపల పెంపకం కోసం ప్రభుత్వం నుంచి అనుమతులు పొందాలి. దానికి అనుగుణంగా నాలా చెల్లించాలి. ● ప్రతి రెండేళ్లకోసారి అనుమతి పత్రాన్ని రెన్యువల్ చేయించాలి. ఇక్కడ ఏ ఒక్క చోట అనుమతిలేకుండా చేపల సాగు జరుగుతోంది. ● కొందరు ప్రజా ప్రతినిధులకు చెందిన భూముల్లో దేవకివాడ, సంగాం, మగ్గురుల్లో యథేచ్ఛగా చేపల పెంపకం చేపడుతున్నారు.

వ్యర్థాలతో చేపల పెంపకం చట్ట విరుద్ధం..

గ్రామాల్లోని చెరువుల్లో వ్యర్థాలతో వేసి చేపలు పెంచడం చట్టవిరుద్ధమని విజయనగరం మత్స్యశాఖ డీడీ నిర్మలాకుమారి తెలిపారు. ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా చేపల చేరువులు నిర్వహించినా, నిషేధించిన చేపలు పెంపకాలు జరిపినా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వెంటనే సిబ్బందిని దర్యాప్తుకు ఆదేశాలిస్తామని తెలిపారు.

పండగలోపు పూర్తయ్యేనా?

(ఐదో పేజీ తరువాయి)

కారణంగా మళ్లీ యథాస్థితి నెలకొంది. ప్రస్తుతం పార్వతీపురం, ఉల్లిభద్ర, సంతోషపురం, ఖడ్గవలస, రావివలస నుంచి పాలకొండ వరకు అడుగడుగునా భారీగా గోతులే దర్శనమిస్తున్నాయి. చీకటి పడిందంటే ఈ మార్గం గుండా ప్రయాణాలు సాగించలేని పరిస్థితి నెలకొంది. ఒకవైపు వాహనాల మరమ్మతులకు గురికాగా మరోవైపు ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

● పార్వతీపురం నుంచి ఉల్లిభద్ర, సంతోషపురం వరకు ఉన్న గోతులను పూడ్చేందుకు రూ. 40 లక్షలు కేటాయించగా.. ఇందులో రూ.10 లక్షలు పనుల కోసం వెచ్చించగా బిల్లులు మంజూరవాల్సి ఉంది. ఉల్లిభద్ర, తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని కుడి ప్రధాన కాలువ ప్రాంతంలో అవసరమైన పనులకు రూ. 1.50 కోట్లుతో ప్రతిపాదనలు చేశారు. ఈ పనులకు సంబంధించి టెండరు ప్రక్రియ ప్రారంభం కాలేదు.

● ఉమ్మడి జిల్లాలకు ఒక్కరే కాంట్రాక్టర్ ఉండడంతో రహదారి అభివృద్ధి పనులు జాప్యమవుతున్నాయి. ఈ ప్రాంతంలోని రహదారుల మరమ్మతులకు అగ్రిమెంట్ కుదిరినా పనులు నిర్వహించడం లేదు. ప్యాచ్ వర్కులు కూడా చేయడం లేదు. ప్రస్తుతం విజయనగరంలో పనులు నిర్వహిస్తున్నారు. అక్కడ పూర్తయిన తర్వాత ఈ ప్రాంతానికి వచ్చే అవకాశం ఉంది. సంక్రాంతి లోగా రహదారులను మెరుగు పరుస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. పండగ లోపుగా ఈ పనులు పూర్తవడం కష్టమేనని వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దీనిపై ఆర్అండ్‌బీ అధికారులు స్పందించాల్సి ఉంది.

పనులు పూర్తికి చర్యలు..

పార్వతీపురం-పాలకొండ ప్రధాన రహదారి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కాంట్రాక్టర్లను సంప్రదించి.. పనులు ప్రారంభానికి ఒత్తిడి తెస్తున్నాం. ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నాం. వర్షాల కారణంగా మొదట్లో ప్రారంభించిన ప్యాచ్ వర్కు పనులు కొంతమేర పాడయ్యాయి. తిరిగి ఆయా ప్రాంతాల్లో పనులు నిర్వహిస్తాం.

-వి.రామ్మోహనరావు, జేఈ, ఆర్అండ్‌బీ శాఖ, పార్వతీపురం

పశువులకు వ్యాధులు..
అందని వైద్య సేవలు

భామిని, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పశువులకు వ్యాధులు సోకుతున్నా వైద్య సేవలు అందడం లేదని మన్యంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని తివ్వకొండ కొండ శిఖర గ్రామాల్లో మణిగ, రాతులగూడ, చీమలగూడ, బండ్రసింగి తదితర గ్రామాల్లో మేకలు, గొర్రెలు వ్యాధికి గురికావడంతో పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు. సరైన వైద్యం అందక పదుల సంఖ్యలో పశువులు మృతి చెందుతున్నాయని వాపోతున్నారు. మేకలకు జబ్బులు వచ్చి ఏమి తినకపోవడంతో నీరసమై రెండు మూడు రోజుల్లోనే నోటి వెంబడి తేపకార్చి మృతి చెందుతున్నాయని చెబుతున్నారు. నిమ్మల రమేష్‌కు చెందిన మేకలు పదుల సంఖ్యలో మృతి చెందగా, మరో మూడు మేకలు వ్యాధిబారిన పడ్డాయి. ఆ మేకలను మందలో కలపకుండా వేరే చోట సేవలు చేస్తున్నామని రమేష్ చెబుతున్నారు. అలాగే శివాజీ తదితరులకు చెందిన మేకలు కూడా వ్యాధి బారినపడ్డాయి. వెంటనే వాటికి వ్యాక్సిన్ వేసి నివారణా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. పల్లపు ప్రాంతంలో ఆవుదూడలకు ముద్ద చర్మం వ్యాధి సోకిందని పెంపకందారులు వాపోతున్నారు. మండలంలో ఇన్‌చార్జి పశు వైద్యాధికారి ఉన్నప్పటికీ ప్రయోజనం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా మండలంలో పశువులకు ఆశిస్తున్న వ్యాధులపై బొడ్డగూడ వెటర్నరీ అసిస్టెంట్ సుమ వద్ద ప్రస్తావించగా తాను సెలవులో ఉన్నట్టు పేర్కొన్నారు.

అరకొర కందిపప్పుతో అవస్థలు

భామిని, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల అధికారులు పీడీఎస్ లబ్ధిదా రులకు కంది పప్పులో కోతవిధించారు. దీంతో పూర్తిస్థాయిలో కందిపప్పు అందడం లేదు. ఈనేపథ్యంలో అరకొరగా కందిపప్పు అందడంతో వారంతా అవస్థలకు గురవుతున్నారు. భామిని మండలంలో 14,499 రేషన్‌కార్డుదారులు ఉండగా 60 శాతం మాత్రమే కందిపప్పు సరఫరా చేయడంతో 40 శాతం లబ్ధిదారులకు అందని పరిస్థితి నెలకొంది. బొడ్డగూడలో ఆదివారం ఎండీయూ వాహనం ద్వారా సరుకులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డీలర్ బి.నాగేశ్వరరావు వద్ద ఈ విషయాన్ని ప్రస్తావించగా మణిగ పంచాయతీలో 674 రేషన్‌కార్డులు ఉండగా 500 కార్డులకే కందిపప్పు వచ్చిందని తెలిపారు. ముందుగా ఎవరు తీసుకుంటే వారికే అందుతుందని, మిగిలిన వారికి ఏమీ చేయలేమన్నారు. దీనిపై సివిల్ సప్లయి డీటీ మధు వద్ద ప్రస్తావించగా గోదాముకు వచ్చిన నిల్వల ప్రకారం ఈనెలలో 60 శాతమే కందిపప్పు పంపిణీ చేస్తున్నారని తెలిపారు.

గిరిజన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర

సీతంపేట రూరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): గిరిజన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించి, ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు జీసీసీ సమాయత్తమైంది. ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన 'వీరు కొనరు.. వారు అమ్ముకోనివ్వరు' అనే కథనంపై అధికారులు స్పందించారు. ఈ మేరకు శనివారం కుసిమి వారపు సంతలో గిరిజనులు తీసుకువచ్చిన కొండచీపుర్లను జీసీసీ బీఎం డి.కృష్ణారావుల ఆధ్వర్యంలో సిబ్బంది కొనుగోలు చేశారు. సీతంపేట జీసీసీ పరిధిలో సీతంపేట, కుసిమి, పూతికవలస, మర్రి పాడు, భామిని, పొల్ల, దోనుబాయి, శంభాం, గొట్టిపల్లి వంటి 9 కేంద్రాల్లో అటవీ ఫలసాయాలను కొనుగోలు చేస్తున్నట్లు జీసీసీ బీఎం డి.కృష్ణారావు చెప్పారు. కొండ చీపుర్లను మూడు గ్రేడ్‌లుగా విభజించి చీపురు నాణ్యత ఆధారంగా మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. జీసీసీ ఛైర్మన్, ఎండీ ఆదేశాల మేరకు కొండచీపుర్లతో పాటు చింతపండు, నల్లజీడి పిక్కలు, కరక్కాయలు, కుంకుడు కాయలు, చింతపిక్కలు, తాని కాయలు, ఎండు ఉసిరిపప్పు, ముసిడి పిక్కలు, ఇండుగ పిక్కలను కొనుగోలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ సిబ్బంది

బొబ్బిలి రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని గున్నతోటవలస రెవెన్యూ గ్రామంలో గల 19-1బి-1 సర్వే నెంబర్‌లోని సుమారు పది సెంట్ల ప్రభుత్వ స్థలంలో అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేశారు. కొందరు ఆ స్థలం కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలుసుకుని రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఆ స్థలం విలువ సుమారు 15 లక్షలు ఉంటుందని, స్థలాన్ని సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ కార్యాలయ నిర్మాణం కోసం ప్రభుత్వం సేకరించిందని సిబ్బంది తెలిపారు. ఆ స్థలంపై నుంచి హైపవర్ విద్యు త్ తీగలు ఉండడం వల్ల ఇంతవరకూ నిర్మాణం చేపట్ట కుండా ఖాళీగాఉంచారని చెప్పారు. దీంతో ఆ స్థలంలో కొందరు పువ్వుల మొక్కలు, కూర గాయల పెంపకం చేశారు. ఈ విషయాన్ని స్థానికులు తహసీల్దార్‌కు తెలియజేయగా ఆదివారం రెవెన్యూ సిబ్బందిని పంపించి మొక్కలను తొలగించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వీఆర్వో వెంకినాయుడు, సర్వేయర్ సునీల్, స్వాతి పాల్గొన్నారు.

పల్లె పండగలా రహదారుల ప్రారంభోత్సవం

● మంత్రి సంధ్యారాణి



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఈనెల 6, 7 తేదీల్లో చేపట్టనున్న వంద రోడ్ల ప్రారంభోత్సవానికి ప్రజలు, కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. ఈ మేరకు ఆదివారం సాలూరులోని తన నివాసంలో ఆమె స్థానిక విలేకర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గంలో పల్లె పండగలా వంద రహదారుల నిర్మాణం చేయబోతున్నామని తెలిపారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం మక్కువ మండలంలో కాశీపట్నం సీసీ రోడ్డు తోపాటు 35 సీసీ రోడ్ల ప్రారంభిస్తున్నట్లు ఆమె తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం సాలూరు మండలంలో తోణాం పంచాయతీతో పాటు మండలంలో 18 సీసీ రోడ్లు ప్రారంభిస్తామన్నారు. మంగళవారం పాచిపెంట మండలం మంచాడవలస గ్రామంతో పాటు మండలంలో 27 సీసీ రోడ్లు ప్రారంభిస్తున్నామని, అదే రోజు మధ్యాహ్నం మెంటాడ మండలంలో పెదమేడపల్లి తోపాటు 22 సీసీ రోడ్లు ప్రారంభిస్తామని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, పరమేష్, గుళ్ల వేణు, పిన్నింటి ప్రసాద్‌బాబు, యుగంధర్ తోపాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా రాష్ట్రం

● చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు

పాలకొండ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందని మాజీ మంత్రి, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. పాలకొండలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పింఛన్ రూ.4వేలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో గుంతలమైన రోడ్ల మరమ్మతుల కోసం కూటమి ప్రభుత్వం రూ.950 కోట్లు కేటాయించిందన్నారు. ఇటీవల టీసీఎస్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిందని, దాని ద్వారా సుమారు రెండు వేల ఉద్యోగాలు లభిస్తాయన్నారు. అనంతరం పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడారు. 77 ఏళ్లగా మండలంలోని అర్దలి గ్రామానికి రహదారి సౌకర్యం లేదని, కూటమి ప్రభుత్వం వచ్చా క నిధులు కేటాయించి పనులు ప్రారంభించిందని తెలిపా రు. ఈ సమావేశంలో నాయకులు గంటా సంతోష్‌కుమార్, పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, వెన్నపు శ్రీనివాసరావు, కిమిడి కాశింనాయుడు తదితరులు పాల్గొన్నారు.

యుగ పురుషుడు ఎన్టీఆర్



విశ్వతేజ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు కళా, జయకృష్ణ

పాలకొండ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఒక యుగానికి పురుషుడు ఎన్టీఆర్ అని మాజీ మంత్రి, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట రావు అన్నారు. ఆదివారం స్థానిక ఎస్‌వీడీ కల్యాణ మండపంలో విశ్వతేజ పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు రాజకీయ జీవితం పై పాలకొండ పట్టణానికి చెందిన విశ్రాంత గ్రం థాలయ ఆచార్యుడు కనపాక చౌదరినాయుడు 'విశ్వతేజ' పుస్తకాన్ని రచించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో కళా వెంకటరావు పాల్గొని, మాట్లాడారు. ఎన్టీఆర్ అన్ని వర్గాల కు సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించి విశ్వతేజ అనిపించుకున్నారని కొనియాడారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, సురంగి మోహన్‌రావు, డీవీ ప్రసాద్, శ్యాంప్రసాద్, పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, గంటా సంతోష్‌కుమార్, సీఎల్ నాయుడు, బుడితి అప్పలనాయుడు, వాసునా యుడు, గంగునాయుడు, పాలవలస సత్యంనాయుడు, బౌరోతు శంకరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎన్టీఆర్‌కు సంబంధించిన రాజకీయ, సినీ చరిత్రకు సంబంధించి ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రదర్శించారు.

న్యూస్ బాక్స్

శంబర జాతరలో దుకాణాల ఏర్పాటుకు 8న వేలం

మక్కువ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): శంబర పోలమాంబ అమ్మవారి జాతర ఈనెల 27, 28, 29 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో ఏర్పాటు చేయబోయే దుకాణాలకు ఈనెల 8న వేలంపాట నిర్వహిస్తున్నట్టు ఈవోఆర్డీ పి.దేవకుమార్ తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు హోటల్స్, పార్కింగ్, చిరు దుకాణాల ఏర్పాటుకు పంచాయతీకి ముందుగా రూ.20 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. వివరాల కోసం శంబర సచివాలయ కార్యదర్శిని సంప్రదించాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

గుమ్మలక్ష్మీపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కందికొత్తల పండగలో జరిగిన అపశృతిలో ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయిన రమేష్ కుటుంబానికి గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన బుడకాయల శ్రీనివాసరావు రూ.10వేలు సాయం చేశారు. ఈ మొత్తాన్ని ఆయన తరఫున బొత్సాడ గౌరీశంకరరావు చెముడుగూడ వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం హెల్పింగ్ హేండ్స్ సభ్యులు తుంబలి వినోద్, మద్ది దొరబాబు, స్వాతి రెడీమేడ్ కొనిశ సూర్యం, డిజిటల్ అసిస్టెంట్ జి.సందీప్, సదానంద్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల నిర్వహణకు..

పాలకొండ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం నగర పంచాయతీ ఛైర్మన్ పల్లా ప్రతాప్, ఉద్యోగుల సంఘ నేత భరత్‌భూషణ్‌రాజు క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వాహకులకు టీడీపీ నాయకుడు పల్లా కొండలరావు రూ.20వేలు సాయం అందించారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు

మక్కువ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మార్సీ భవనంలో ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటుచేశారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 47 మంది విద్యార్థులకు ఆధార్‌కార్డులు లేకపోవడంతో వారి సౌకర్యార్థం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ కేంద్రాన్ని వినియోగించుకోవాలన్నారు.

ఉత్సాహంగా..

● సీతంపేటలో పర్యాటకుల సందడి



ఎన్టీఆర్ ఎడ్వంచర్ పార్క్‌లో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

సీతంపేట రూరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలోని పర్యాటక ప్రాంతాల్లో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. మెట్టుగూడ జలపాతం, ఆడలి వ్యూ పాయింట్, ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో యువతీ, యువకులు, చిన్నారులు ఉల్లాసం గా.. ఉత్సాహంగా గడిపారు. పార్క్‌లో సాహ సోపేతమైన క్రీడల్లో పాల్గొని ఆనందంగా గడిపారు.

మాతృ భాషను భావితరాలకు అందించాలి

బొబ్బిలి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మాతృ భాషను భావితరాలకు అందించే గురుతర బాధ్యత భాషోపాధ్యాయులదేనని ప్రముఖ కవి, రచయిత కిలపర్తి దాలినాయుడు తెలిపారు. బొబ్బిలి రోటరీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రపంచ తెలుగు సమాఖ్య మహా సభల వేడుకలు జరుగు తున్న నేపథ్యంలో నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగుభాషను బోధిస్తున్న 20 మంది ఉపాధ్యాయులు, భాషాభిమానులను రోటరీక్లబ్ ప్రతి నిధులు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా దాలినాయుడు మాట్లా డుతూ నేటితరం అభిరుచి, ఆసక్తికి అనుగుణంగా రచనలురావాలన్నారు. కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ జేసీ రాజు, రచయితలు మీసాల చినగౌరునాయుడు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.